# మోసం

మారేమండ సీతారామయ్య

ఆమె ఎలా పరిచయమైందో మరిచిపోయానుగాని, పరిచయమైన ఆమెను మాత్రం మరిచిపోలేకుండా వున్నాను!

ఆమె ఎన్ని సంవత్సరాల క్రితం నా హృదయ వీధిలో ప్రవేశించిందో మర్చిపోయానుగాని, ఆ పరిధి అంతా ఆమే ఆక్రమించిందనే విషయం మర్చిపోలేకుండా వున్నాను!

గత రెండేళ్ళనుంచి మా పరిచయం మేరు పర్వతంలా పెరిగిపోయింది. మర్చిపోలేని ఎన్నో మధుర సంఘటనలు మా పరిచయాభివృద్ధికి మైలు రాళ్ళయ్యాయి!

ఆమెను నేను పూర్తిగా నమ్మాను.

సంపూర్తిగా విశ్వసించాను.

ఆమే నా సర్వస్వం అనుకున్నాను, ఆమెతో నా బ్రతుకు బాటను బంగారు బాటగా మార్చాలనుకున్నాను. ఆమెను నా జీవిత భాగస్వామిగా ఎన్నుకోవాలనుకున్నాను,

కాని ఇంతలోనే ఆమె మోసం చేస్తుందనుకోలేదు.

ఐనా ఎవరో అన్నట్టు ఆడదాన్ని నమ్మమని ఎవరు చెప్పారు?

అసలు ఆమె ఇలా మారిపోటానికి కారణం?

ఏమో! ఆమెకే తెలియాలి.

కిటికీలోంచి తొంగిచూశాను.

వాళ్ళ డాబామీద నిలబడి ఆమె నా గదికేసి చూస్తోంది.

డాబామీద నిండుగా అందంగా చక్కటి పందిరి వేసారు. పందిరిలో

కుర్చీలు వేశారు. నాలుమూలలా ట్యూబులైట్లు అమర్చారు. ప్రతిఒక్కరి మొహంలోనూ సంతోషం ముద్రవేసు కుంది.

పట్టుచీరలలో వాళ్ళ పెద్దవాళ్ళు హడావిడిగా తిరుగుతున్నారు. చూడ ముచ్చటైన పరికిణీలలో ఆమె చెల్లెళ్ళు హడావిడంతా తమదే అన్నట్లు తిరుగు తున్నారు.

ఆమె తెల్లటి గుంటూరు చీరపై గులాబిరంగు టెర్లీన్ జాకెట్టు వేసుకుని తలలో బొండు మల్లెలు తురుము కుంది!

నాకు పరిచయమైనప్పుడు సరిగ్గా ఇవే దుస్తులు ధరించింది.

ఏడాదినుంచి ఆమె నాకళ్ళముందే తిరుగుతున్నా నేను గుర్తించని, నివురు గప్పిన ఆమె అందాన్ని గుర్తింప గలిగేటట్లుచేసినదుస్తులు ఇవే! అందుకే ఆ బట్టలంటే నా కంత మక్కువ. ఈ బట్టలే ఎవరైనా వేసుకుంటే ఆమె చటుక్కున జ్ఞాపకం వచ్చేది.

ఇంకా ఆమె ఇటే చూస్తోంది.

ఇష్టంలేక పోయినా కోపంగా కిటికీ తలుపులు మూసివేసాను.

మాటమాత్రానికైనా "రేపు మా తమ్ముడి ఉపనయనమండీ" అని చెప్పద్దూ? మర్యాదకైనా పిలవద్దూ?

పిలిచినంతమాత్రాన పరుగెత్తుకెళ్ళి వాళ్ళింట్లో తిష్టవేస్తాననుకుందా? లేక పోతే వాళ్ళ తాహతుకు నేను తగనను కుందా?

వాళ్ళింట్లో జరిగే శుభకార్యం చూసే అర్హత అప్పుడు నాకు లేదని తెలుసు!

కాని ఆ శుభకార్యం గురించి వినే అర్హత వుందిగా?

పిలవటానికి స్త్రీగా స్వతంత్రం లేదనుకుందాం!

ఈ విషయం చెప్పటానికి స్వతంత్రం వుందిగా?

విషయాన్ని విడమర్చి చెపితే విన నటువంటి మూర్ఖుడ్నికాదుగా!

ఏమైనా ఈమధ్య ఆమె దృష్టిమారి పోయింది!

నాపై రోత పుట్టింది కాబోలు!

నాకుఅందంలేదు. నాలో ఏఆకర్షణా లేదు!

ఆమె అప్సరస!

నాకు చెప్పుకోదగ్గ ఆస్తిలేదు.

ఆమె ఎత్తుమారి చేతిబిడ్డ!

ఇక చదువు సంగతా?

విలువలేని దానిసంగతి పట్టించు కునే ఈ లోకంలో శూన్యం!

"అర్ధము పురుషార్థము లోపల నుత్తమము. అర్ధవంతున కసాధ్యము లోకమందేదియు గానము. కనుక పురుషుడు న్యాయము తప్పక ధనము సంపాదింపవలెను. ఇంత సంపాదించి తిని ఇంకేలయని తనియరాదు. బుద్ధి మంతుడు ఒరామరణములు లేవని వలె విద్యాధనములు గడించును."

బాల్యంలో వల్లె వేసిన చిన్నయ సూరి ప్రబోధం జ్ఞాపకం వచ్చింది.



సూరి అసూయకుడు కాబట్టే "ఇంత సంపాదించితిని ఇంకేల యని తనియ రాదు" అని చెప్పాడు.

కాని ఈ కాలంలో తృప్తిపడె మనిషెవ్వడున్నాడు ?

పాపానికి పరిధులు లేనట్లే ఆశకు కూడా అంతులేకుండా పోతోంది. కాని నేను ఒకందుకు సంతోషిస్తున్నాను. సూరి "విద్యాధనములు" అని అన్నాడు. విద్యకు ధనంకంటే ముందు చోటిచ్చాడు.

చటుక్కున ఆమె వాదం జ్ఞాపకానికి వచ్చింది.

"మాస్టారూ! విద్యాధనములు అని సూరి ఎందుకన్నాడో తెల్సాండి? విద్య మీదుండే గౌరవం కొద్ది అనుకునే. పొరపాటు! ధన విద్యలు అని అంటే సమాసం పొందికగా ఉండదని విద్యా ధనములు అని అన్నాడు. సూరి కూడా డబ్బంటే మోజే! లేక పోతే 'ఇంత సంపాదించితిని ఇంకేల యని తనియరాదు" ఎందుకు అని చెప్పాడు?"

ఈ వాదంలో నిజం లేకపోయినా త్రోసి వేయలేని వాదం! ఈ మాటలు ఆమె అన్నప్పుడు ఆమె తార్కిక దృష్టిని నేను మెచ్చుకున్నాను.

కాని ఇప్పుడు ఆమె సహజ ప్రవృత్తి అదే అని తెల్సిం తరువాత ఆ మాటల్లో అసహ్యం నాకు స్పష్టంగా బోధపడింది.

ఆమె మారిందని చెప్పటానికి ఇంత కంటే నిరూపణ ఏం కావాలి?

ఆమె మనుషులు వాళ్ళ మమతలు కంటే. ఆ మనుషులు సృష్టించిన డబ్బుకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తోం దని చెప్పటానికి వేరే దృష్టాంతరం ఎందుకు?

ఊరుకాని ఊరు ఎక్స్కర్షన్ వెళితే తినటానికి హోటలు లేకపోతే, తన కేరేజిలో సగం పంచి ఇచ్చిన ఆమేనా ఈమె?

మాటవాలుగు జ్వరం వచ్చినా పథ్యం పుచ్చుకున్న మర్నాడే ఆమె గురించి రెండుమైళ్ళు పొలంగట్లు అడ్డుపడి చెరుకు పానకం తెచ్చినప్పుడు కృతజ్ఞత కళ్ళల్లో మెరిసి పోతూంటే "మాస్టారు! నా మాటంటే మీకు ఎంత ఇదండి! నా గురించి ఇంత శ్రమపడ్డారా? మీరు తెచ్చారు కాబట్టే పానకం ఇంత తీపిగా ఉంది." అంటూ మరిసిపోయిన ఆమేనా ఈమె?

"సినిమాకు వెడుతున్నాం రండి!" అనే సందేశం నాకు అందచేయటానికి డాబా ఎక్కి తన చెల్లెలుతో "మేం ఈ పూట మేట్నీ కెళతామోచ్చి" అని ఊరంతటికీ వినిపించేలా నాకోసం అరచిన ఆమేనా ఈమె? కాలేజీలో ఏదో నాటకం వేయటానికి లాంగ్ బ్లాక్ గౌను నాకు కావలసివస్తే తన స్నేహితురాళ్ళ ఇళ్ళకుమండు టెండలో చెమటలు గక్కుతూ వెళ్ళి, చిట్ట చివరకు సంపాదించి "ఇదుగోనండి! ఇదేనా మీకు కావలసిన గౌను?" అంటూ నా గురించే శ్రమపడ్డ ఆమేనా ఈమె?

"నేను చెప్పకుండా మా ఊరెళ్ళానని కోపం వచ్చిందిట కదండి! ఏమీ అనుకోకండి, చెప్పటానికి వ్యవధిలేక పోయింది మరి, మా ఊరెళ్ళాలని ఇష్టం లేకపోయినా తప్పలేదండి." అంటూ గమ్మత్తుగా ప్రాధేయపడ్డ ఆమేనా ఈమె?

"ఇంట్లో కొంచెం హడావిడిగా ఉండటంవల్ల ఈ ఉత్తరం వ్రాయటం ఆలస్యమైంది. కోపగించుకుంటున్నారా? గించుకుంటే ఓ కేకే వాయండి. ఆనక

రావోయే మీ ఆవిడమీద చూపిద్దువు గాని. అయినా అడ్వాన్సుగా నాకో వంద గ్రాములు ఇస్తారేంటి?" అంటూ చమత్కారంగా ఉత్తరాలు వ్రాసిన ఆమేనా ఈమె?

కాదు! ముమ్మాటికి కాదు!!

ఆనాటి ఆమె ఈనాటి ఈమెకాదు!!!

ఆమె మూర్తీభవించిన ప్రేమ మూర్తి! నా హృదయరాణి.

ఈమె డబ్బు అనే వలయంలో చిక్కిన విషపురుగు,

అంతస్థు, హోదా, ఆస్తి మొదలైన సుడిగుండాల్లో దిక్కూ మొక్కూ లేకుండా తిరిగే కెరటం!

కిటికీ తలుపు అయిష్టంగానే తెరిచాను.

ఆమె అక్కడ లేదు!

ఆమె అక్కడే నిల్చి నాకోసం నిరీక్షించి ఉంటే నాకు కొంత శాంతి లభించేది.

కాని అలా జరగలేదు!

నాలో ఒక్కసారి ఏదో తెలియని విచారం, నిర్లిప్తత, ఉదాసీనత, ఆవేదన, అసహనం, ఆరాటం ఇంకా మాటల్లో వెలువరించలేని విరుద్ధ భావాలు కలిగాయి.

జరగబోయె ఆ శుభకార్యం ఒక్కసారిగా ఏ అవాంతరంవల్లో ఆగిపోతే బావుండుననిపించింది.

పరిసర ప్రపంచం ఒక నిశ్శబ్దమైన శ్మశానంగా మారిపోయి, చుట్టూ అంధకారం వ్యాపిస్తే ఆ శ్మశానంలో, ఆ అంధకారంలో కట్టబడిన గోకిలమీద విశ్రాంతి తీసుకోవాలనిపించింది!

దూరంగా ఎక్కడికో ఎవ్వరూలేని ఎత్తైన ఓ ప్రదేశంలోకి పారిపోయి, ఆకాశంలో మినుకు మినుకు మనే నక్షత్రాలను చూస్తూ ఆ నక్షత్రాలలో ఐక్యం అయిపోవాలనిపించింది!

"సికో" లా ప్రపంచం భగ భగ మనే మాటలలో మలమలా మాడిపోతుంటే చూస్తూ బుల్ బుల్ వాయించుకోవాలనిపించింది!

రైల్వే స్టేషనులో ఉన్న బ్రిడ్జి ఎక్కి చుట్టూఉన్న ప్రదేశాన్ని, దూరంగా కల్సిపోటానికి ప్రయత్నించే రైలు పట్టాలను, చీకటి గుసెలో కుళ్ళిపోయినా కళ్ళు తెరుమ్మకునేందుకు జంకని యౌవ్వనాన్ని, కాలువలో ప్రతిఫలించె రోడ్డుమీది ట్యూబ్ లైట్ల కాంతిని చూస్తూ ఓశిలా ప్రతిమ అయిపోవాలనిపించింది!

అయోధ్యరామయ్య చెరువుగట్టున ఉన్న పాడుబడ్డ సున్నపు బట్టీపై భాగంలో కూర్చొని. దానిలో రాళ్ళు దోసిలినిండా తీసుకుని కసిగా క్రిందకు విసురుతూ ఆకలితో అక్కడే మాడి చావాలనిపించింది!

నిర్జనమైన ప్రదేశంలోకి పోయి వెక్కి వెక్కి ఏడ్చి, పిచ్చిగా, బిగ్గరగా నాకు వచ్చిన భాషలన్నిటిలోనూ ఆమె చేసిన మోసం గురించి అరవాలనిపించింది!

విభిన్నములు, వ్యతిరేకములు

అయిన భావాలు మిశ్రమవటంవల్లనే సాదా మనిషి ఒకోసారి గంభీరమైన వ్యక్తిగా కాని, లేదా హంతకుడుగాని, లేదా పిరికివాడుగాకాని లేదా మానసిక రోగిగాకాని మారిపోతాడట!

ఆమె గురించి ఆలోచించి ఆలోచించి మెదడు మొద్దుబారి పోయింది! చీకటిపడ్డా లైటువేసుకోవా లనిపించ లేదు ఆ క్షణంలో! వ్యధిత హృదయాలకు చీకటిలోనే శాంతి లభిస్తుందట!

* * *

కాలచక్రం రెండేళ్ళు ముందుకు కదిలింది.

వాళ్ళ డాబా మీద నిండుగా అందంగా పక్కాటి పందిరి వేసారు. పందిరిలో కుర్చీలు పేర్చారు. నాల్గు మూలలా ట్యూబు లైట్లు వెలుగుతున్నాయి.

ప్రతి ఒక్కరి మొహంలోనూ సంతోషం ముద్రవేసుకుంది.

పట్టుచీరలలో వాళ్ళ పెద్దవాళ్ళు హడావిడిగా తిరుగుతున్నారు. చూడ ముచ్చటైన పరికిణీలలో ఆమె చెల్లెళ్ళు హడావిడంతా తమదే అన్నట్లు తిరుగుతున్నారు!

కాని జరుగుతున్న శుభకార్యం ఆమె తమ్ముడి ఉపనయనం కాదు!

ఆమె పెళ్ళి!

ఏ కిటికీ లోంచైతే నేను ఆమెను పరిశీలించానో, ఆ కిటికీలోంచే ఆమె వివాహవేడుక తిలకించవల్సి వచ్చింది.

నాడు ఆహ్వానింపబడని ప్రేక్షకుడ్ని!

నేడు ఆమెచే ఆహ్వానింపబడిన ప్రేక్షకుడ్ని!

ఆనాడు ఆ వేడుకను నేను నా కండ్లతో కన్నులారా చూసాను. కాని నేను అందుణ్ణి!

నా మానసిక నేత్రం మూసబడింది.

గాజు కళ్ళతో ఆ తంతుని చూస్తున్నాను.

పురోహితుడు ఆమెకు చదివే మంగళకర మంత్రాలు నాకు తుది ఘడియలలోని దైవనామస్మరణలుగా వినిపిస్తున్నాయి!

సంతోషంతో ఆమెకు ప్రయోగింపబడే బాజా భజంత్రీలు నాకు చావు మేళంగా వినిపిస్తోంది!

ఆమె ముఖంలో సంతోషం గంతులేస్తోంది.

నాకు దుఃఖం ముంచుకొస్తోంది.

ఒక్కసారిగా పీకపిసుక్కుని చచ్చిపోదామనిపించింది.

ఆపాలనుకున్న కన్నీరు అడ్డు లేకుండా కట్టలు తెంచుకొని కారుతోంది!

అలగ్జాండర్ పోప్ "కంపెన్ సెడ్ మాన్" నా కళ్ళల్లో కదిలాడు.

ప్రొద్దున క్లాస్‌లో చెప్పిన ఆ పాఠం మనసులో మెదుల్తూ నన్ను చిత్రహింస చేస్తోంది.

"దజ్ అన్‌సీన్ అన్‌నోన్,

దజ్ లామెంటెడ్ లెట్ మి డై:

అండ్ స్టీల్ ఫ్రం ది వరల్డ్,

అండ్ నాట్ ఎ స్టోన్ టెల్ వేర్ ఐ లై."

"వద్దు" నేను చచ్చిం తరువాత నన్ను గుర్తుచేసే సమాధి కూడా నాకుండకూడదు. బ్రతికి తృప్తికి దూరమయ్యాను. కనీసం చచ్చైనా అది సాధిస్తాను. స్థిరనిశ్చయంతో నా మెడను నా చేతులు చుట్టివేసాయి.

• • •

"ఏటి బాబు కలవరిస్తుంటా! సీటీ ఇస్తుంటే నా చెయ్యి నలిపేస్తారేంటి? అమ్మగారు మీకిచ్చారు." అప్పలమ్మ ఓ చీటీ నా చేతికిచ్చి తన చేతిని లాక్కుంటూ కేరేజీ టేబుల్ మీద పెట్టి వెళ్ళిపోయింది.

ఒక్కసారి కళ్ళు నులుముకున్నాను. చీటీ చదువుకున్నాను.

"అయ్యా! అలకేశ్వరావ్‌గారు!

అంత కోపమైతే నేనెంత బాధపడతానో తెల్సా? తెల్సా? అఅఅఅ... మా తమ్ముడు మిమ్మల్ని పిలవటానికి నిన్న మీ ఇంటికొస్తే లెక్చరరుగారు కేరాఫ్ కాలేజీ ప్రొద్దుట్నించీ తీరిక లేదు. రెండు గంటలు నుంచీ ఇటు చూస్తారేమోనని డాబామీదే నిలుచున్నాను. హాఁ అయ్యగారు పక్కేసి ఉంటారు! ఏం కలలు కంటున్నారో?

మీకు నా మీద చాలా కోపం వచ్చింది కదూ! అందుకే ఫోంచేయకుండా ఎనిమిదంకేసారు. భోజనంతో పాటు మీ కిష్టమని బొబ్బట్లు కూడా కేరేజీలో పంపుతున్నాను. తిని శాంతించండి. అన్నట్టు... సగం మిగల్చండోయ్! నేను కూడా కాచుకూర్చుంటాను ఉంటా.

ఇట్లు
తమసొత్తు.

కిటికీ తలుపులు తెరచాను.

తన దగ్గరున్న అనురాగమంతా రంగరించి తన చూపుల్లో గుమ్మరించి నవ్వులు కురిపిస్తోంది.

"పడినముద్ర చెరిగిపోదురో, షోగ్గాడ, పిల్లమనసు మారిపోదురో"

దూరంగా గాలిలో తేలివస్తున్న పాట నా చెవులకు అతిమధురంగా వినిపించింది.

•••